ప్రజాశక్తి
శుక్రవారం 28 జూన్ 2024



బీటెక్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల పరిధిలో మే-2024లో నిర్వహించిన బీటెక్ రెండవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్20), మూడవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు గురువారం విడుదల అయ్యాయి. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో వీటిని విడుదల చేశారు. విద్యార్థులు వారి పరీక్ష ఫలితాల కోసం కళాశాల అకడిమిక్ సెక్షన్‌లో సంప్రదించాలని ప్రినిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య ఇ.అరుణ కాంతి , డిప్యూటీ కంట్రోలర్ అఫ్ ఎక్సామినేషన్స్ డాక్టర్ డి.విష్ణు వర్ధన్, డాక్టర్ డి.లలిత కుమారి వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ కళ్యాణి రాధ , డాక్టర్ ఎం.రామ శేఖరరెడ్డి, డాక్టర్ జి.మమత, అజిత పాల్గొన్నారు.



పేదలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న వ్యకాసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు


హామీలపై మాట నిలుపుకోవాలి

◆ పేదలకు 2సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలి

◆ వ్యకాసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-హిందూపురం

అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి పేదలకు అండగా నిలవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు తెలియజేశారు. హిందూపురం పట్టణంలో ఇళ్లు లేని నిరుపేదలు పట్టణ సమీపంలోని కొట్నూరు ఇందిరమ్మ కాలోని సమీపంలో సిపిఎం ఆధ్వర్యంలో భూ పోరాటం చేసి గుడిసెలు వేసుకున్నారు. గురువారం ఆయన భూ స్వాధీన స్థలాన్ని పరిశీలించి అక్కడ పేదలతో మాట్లాడారు. అనంతరం ఇళ్ల స్థలాల పోరాట కమిటీ కోకన్వీనర్ జ్యోతమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. టిడిపి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇళ్లులేని వారందరికీ 2సెంట్ల నివాస స్థలాన్ని ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామి మేరకు ఇళ్లు లేని వారందరికీ ఇంటి స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అందరం కలిసి పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్దం అవుతామన్నారు. కొట్నూరు ఇందిరమ్మ కాలనీ వద్ద గుడిసెలు వేసుకున్న పేదలందరికీ తక్షణం అక్కడే పట్టాలు ఇవ్వాలన్నారు. లేని పక్షంలో జూలై 15 నుంచి ఇళ్ల స్థలాల హక్కుల సాధన కోసం పేదలతో కలిసి సిపిఎం, అనుబంధ సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున పోరాటం చేస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్, పెద్దన్న, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు, పేదలు పాల్గొన్నారు.



రాష్ట్రంలో అధికారం మారింది. వైసిపి ప్రభుత్వం ఘోరంగా ఓటమిని చవిచూసింది. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటైంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల్లోని పాలకవర్గాల్లో మార్పులు, చేర్పులు కనిపిస్తున్నాయి. అధికారపార్టీ వైపునకు వలసలు పెరుగుతున్నాయి. ప్రధానంగా పురపాలక సంఘాల్లో ఎక్కువగా వలసలు మొదలయ్యాయి. ఉమ్మడి జిల్లాలో తాడిపత్రి మినహా అన్ని మున్సిపాల్టీలు వైసిపి చేతిలోనే ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారం మారిన నేపథ్యంలో మున్సిపాల్టీల ఛైర్మన్ కుర్చీ కూడా కదిలేలా కన్పిస్తోంది. మెజార్టీ కౌన్సిలర్లు అధికార టిడిపి కండువా కప్పకునేందుకు ప్రయత్నిస్తుండడంతో మున్సిపల్ రాజకీయాలు రసవత్తరంగా మారాయి.



మారుతారా.? మార్చేస్తారా.?

◆ స్థానిక సంస్థల్లో మార్పులు-చేర్పులు..!

◆ పురపాలక సంఘాల్లో మొదలైన వలసలు

◆ పాలకవర్గాల్లోనూ మార్పులకు అవకాశం ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా 2021లో వైసిపి అధికారంలో ఉన్న సమయంలోనే మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగాయి. అప్పట్లో రాష్ట్రంలో ఒక్క తాడిపత్రి మున్సిపాలిటీ మినహా అన్నింటినీ వైసిపి కైవసం చేసుకుంది. ఉమ్మడి అనంతపురం జిల్లా వరకు చూస్తే అనంతపురం నగర పాలక సంస్థతోపాటు మొత్తం 12 మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇందులో తాడిపత్రి ఒక్కటే టిడిపి పాలకవర్గముంది. అన్నీ కూడా వైసిపినే గెలుచుకుంది. ఇప్పుడు వైసిపి తరుపున గెలచిన కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. కౌన్సిలర్లు పార్టీ మారేందుకు సిద్ధం అవుతుండడంతో పాలకవర్గాల్లో మార్పులు చోటు చేసుకునే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఒక్కసారి ఛైర్మన్‌గా ఎన్నికైన వారిని దింపాలంటే అవిశ్వాసం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అవిశ్వాసం పెట్టాలంటే నాలుగు సంవత్సరాల కాలం వరకు వీల్లేదన్న నిబంధనలున్నాయి. నేరుగా ఛైర్మన్ పార్టీ మారితే పరిస్థితి భిన్నంగా ఉండే అవకాశముంది. అలా లేకపోతే అవిశ్వాసం పెట్టాలంటే మరో ఏడాది వేచి చూడాల్సి ఉంటుంది. ఎందుకంటే ఇప్పటికి మున్సిపల్ పాలకవర్గాలు ఏర్పాటై కేవలం మూడు సంవత్సరాలు మాత్రమే అయ్యింది.



మడకశిరలో వైసిపి నుంచి టిడిపిలోకి చేరుతున్న కౌన్సిలర్లు

మారుతున్న బలాబాలాలు

మున్సిపాల్టీల్లో బలాబలాలు మారుతున్నాయి. ప్రధానంగా మడకశిర మున్సిపాలిటీలో చూస్తే నలుగురు కౌన్సిలర్లు బుధవారం నాడు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఇక్కడ మొత్తం 20 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఇది వరకు తెలుగుదేశం పార్టీ తరుపున గెలుపొందిన వారు ఐదుగురు ఉన్నారు. ఇప్పుడు చేరిన నలుగురితో కలిపి తెలుగుదేశం బలం తొమ్మిదికి చేరనుంది. ఇక ఎక్స్ అఫిసియోగా ఎమ్మెల్యే ఓటు కలిపి పదికి చేరుతుంది. అంటే ఇద్దరి బలం సమానం కానుంది. మరోకరు పార్టీ మారితే మడకశిర మున్సిపాలిటీలో వైసిపి ఛైర్మన్ పదవిని కోల్పోనుంది. కదిరిలోనూ ఎన్నికలకు ముందే ఐదుగురు వైసిపి కౌన్సిలర్లు టిడిపిలో చేరారు. అప్పటికే అక్కడ టిడిపి తరుపున ఆరుగురున్నారు. ఇక్కడ మొత్తం 36 కౌన్సిలరు స్థానాలున్నాయి. ఎమ్మెల్యే ఓటు అదనంగా కలిసొస్తుంది. పాలకవర్గం మారాలంటే మొత్తం 19 మంది బలం ఇక్కడ ఉండాలి. మరికొంత మది కూడా త్వరలో పార్టీ మారే సూచనలున్నట్టు చర్చ నడుస్తోంది. ఇలా జిల్లాలో అన్ని మున్సిపాలిటీల్లోనూ పార్టీల మార్పులు జరుగుతున్నాయి. పాలకవర్గాల మార్పు జరగాలంటే అవిశ్వాసం పెట్టేందుకు సమయం ఏడాది ఉంది. అంతలోపు ఇంకెన్ని మార్పులు జరుగాయన్నది చూడాల్సి ఉంది.



మంత్రి సవితతో మాట్లాడుతున్న జెసి.దివాకర్‌రెడ్డి

'అధికారం శాశ్వతం కాదు'

◆ మాజీ మంత్రి జెసి.దివాకర్ రెడ్డి

◆ జగన్ పాలనపై విమర్శలు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

అధికారం ఎవరికి శాశ్వతం కాదని, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రజలకు మేలు చేయాలని మాజీ ఎంపీ జెసి.దివాకర్‌రెడ్డి తెలిపారు. బీసీ సంక్షేమ, జౌళీ, చేనేత శాఖల మంత్రి సవితను పెనుకొండ పట్టణంలోని ఆమె నివాసంలో గురువారం కలిశారు. పలు అంశాలపై ఇద్దరు నేతలు కాసేపు చర్చించారు. అనంతరం జెసి విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై విమర్శలు గుప్పించారు. అధికార దాహంతో రాజమహల్‌ను తలపించేలా పార్టీ కార్యాలయాలు నిర్మించడం జగన్‌కే చెల్లుతుందన్నారు. నిబంధనలను తుంగలో తొక్కి ప్రజల సొమ్ముతో పార్టీ కార్యాలయాలు నిర్మించడం జగన్మోహన్ రెడ్డి నియంత పాలనకు నిదర్శనం అన్నారు. ప్రజలు అధికారం ఇచ్చినప్పుడు సద్వినియోగం చేసుకుని ప్రజల మనసుల్లో స్థానం సంపాదించుకోవాలన్నారు. సవితకు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా మహిళలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. సవిత రాజకీయాల్లో ఎంతో కష్టపడి పైకొచ్చారని.. ఆమెకు సముచితమైన స్థానం దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

మంత్రి దృష్టికి అంగన్వాడీల సమస్యలు

ప్రజాశక్తి - సోమందేపల్లి

పెనుకొండ పట్టణంలోని మంత్రి కార్యాలయంలో మంత్రి సవితమ్మను సిఐటియు నాయకులు గురువారం కలిసి అంగన్వాడీల సమస్యలను విన్నవించారు. స్పందించిన మంత్రి సవిత అంగాన్వాడీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి భావమ్మ, కోశాధికారి మాబున్నీసా, పెనుకొండ అర్బన్ సెక్టార్ లీడర్లు లక్ష్మీదేవి , సావిత్రమ్మ, పెనుకొండ రూరల్ సెక్టార్ లీడర్లు శాంతి బాయ్, పార్వతమ్మ, గుట్టూరు సెక్టర్ లీడర్లు సుజాత, సుధామణి, మీనా కుమారి, తురకలాపట్నం సెక్టార్ లీడర్లు పద్మ, సరస్వతి, పెద్ద మంతూర్ సెక్టార్ లీడర్లు అనూష, అలివేలమ్మ, మరువ పల్లి సెక్టర్ లీడర్ శ్యామల గౌరీ, అనిత తదితరులు పాల్గొన్నారు.

మడకశిర నుంచి విజయవాడకు ఆర్టీసీ బస్సు సర్వీసు

మడకశిర : మడకశిర నుంచి విజయవాడకు ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సుసర్వీసును స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్. రాజు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గం నుండి విజయవాడకు ఎంతోమంది చదువులకు, తమ సొంత పనులకు విజయవాడకు వెళుతుంటారన్నారు. అయితే మడకశిర నుంచి బస్సు సౌకర్యం లేకపోవటంతో హిందూపురం, పెనుకొండకు వెళ్లేవారని వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మడకశిర డిపో నుంచి నూతన బస్సు సర్వీసును ప్రారంభించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, కన్వీనర్లు మనోహర్, లక్ష్మీనారాయణ, రవికుమార్, పుల్లయ్య చౌదరి, నాగరాజు, ఓబులేసు, మాధవ రాజు, కౌన్సిలర్ నరసింహారాజు, టిడిపి నాయకులు ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు అందించాలి



సమావేశంలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి

ప్రజాశక్తి-హిందూపురం

జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలను అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యాక్షులు బాబావలి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక బిసి వసతి గృహం వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతు పాఠశాలలు ప్రారంభించి పక్షం రోజులు కావస్తున్నా పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలను సరఫరా చేయని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. వెంటనే పెండింగ్ లో ఉన్నా పాఠ్య పుస్తకాలను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, తరుణ్, జస్వంత్, మంజునాధ్, అమ్రేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల స్థలాలు కబ్జా

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ధర్మవరం రూరల్ ప్రాంతం ఎర్రగుంట శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయం మాన్యంలో భవన నిర్మాణ కార్మికుల కోసం ఇచ్చిన పట్టాలను వైసీపీ నాయకులు కబ్జా చేశారని భవన నిర్మాణ కార్మికులు ఆరోపించారు. ఈ మేరకు వారు స్థానిక ఆర్డీవో, తహశీల్దార్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రీ లక్ష్మి చెన్నకేశవ పురం ఎర్రగుంట లక్ష్మీ చెన్నకేశవ స్వామి మాన్యంలో 700 మంది భవన నిర్మాణ కార్మికులకు ఇళ్లస్థలాల పట్టాలిచ్చారన్నారు. అయితే అప్పటినుండి ఇప్పటివరకు మా అనుభవంలో ఉన్న స్థలాలను భవన నిర్మాణ కార్మికుల నాయకులమని చెప్పుకొంటూ కొంతమంది దౌర్జన్యానికి దిగారన్నారు. అందులో 300 ప్లాట్లు కబ్జా చేసి తమకు అన్యాయం చేశారని వాపోయారు. ఈ విషయంపై ఆర్డీవో, తహశీల్దార్ క్షేత్రస్థాయిలో పరిశీలించి మాకు న్యాయం చేయాలని భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బాలకృష్ణ, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

రామోజీ సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

సాధారణ వ్యక్తి గా జీవితం ప్రారంభించి అసాధారణ స్థాయికి ఎదిగిన రామోజీరావు ఆదర్శనీయుడని మంత్రి సవిత పేర్కొన్నారు. గురువారం తెలుగుదేశం పార్టీ స్థానిక కార్యాలయంలో రామోజీ రావు చిత్రపటానికి మంత్రి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రామోజీరావు లేని లోటు పూడ్చలేనిదన్నారు. కలమే ఆయుధంగా సమాజంలో చైతన్యం నింపేందుకు రామోజీరావు అహర్నిశలు శ్రమించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరావు, మాధవ నాయుడు, మాజీ జడ్పిటిసి శ్రీనివాసులు, జనసేన నాయకులు కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

పుట్టపర్తి క్రైమ్ : పత్రికా రంగానికి ఎనలేని కృషి చేసిన రామోజీరావు జీవితం ఆదర్శనీయమని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా పుట్టపర్తి పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి వేరువేరుగా రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామోజీరావు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపినాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్కె, జెఎన్‌టియు విసిల రాజీనామా.?

ప్రిన్సిపల్ సెక్రటరీకి లేఖలు పంపినట్టు సమాచారం

ఒత్తిళ్లతోనే వైదొలిగారా..?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో ఉన్న రెండు విశ్వవిద్యాలయాలకు సంబంధించిన ఇద్దరు వైస్ ఛాన్సలర్లు తమ పదవుల నుంచి తప్పుకునేందుకు సిద్ధమైనట్టు సమాచారం. ఈ మేరకు ఆ ఇద్దరు ఉన్నతాధికారులు ప్రిన్సిపాల్ సెక్రటరీకి రాజీనామా లేఖలను పంపినట్టు తెలుస్తోంది. శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలరుగా హుస్సేన్‌రెడ్డి, అనంతపురం జెఎన్‌టియుకి జివిఆర్.శ్రీనివాససరావు వైస్ ఛాన్సలర్లుగా నియమిస్తూ జనవరి 17వ తేదీన అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సరిగ్గా ఆరుమాసాలు మాత్రమే వీరు నియమితులై ఉన్నారు. మూడు సంవత్సరాల పదవీకాలనీకి వీరిని నియమించారు. శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలరు ఇక్కడి యూనివర్శిటీలోనే రసాయన శాస్త్రం విభాగాధిపతిగా ఉండేవారు. ఆయన్ను వైస్ ఛాన్సలరుగా నియమించారు. అనంతపురం జెఎన్‌టియుకు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా ఉన్న శ్రీనివాసరావును నియమించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం ఘోర ఓటమిని చవిచూసింది. అత్యధికమైన మెజార్టీతో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కొలువుదీరిన వెంటనే ప్రక్షాళన మొదలు పెట్టింది. వైసిపి అధికారంలో ఉన్న సమయంలో వారికి అనుకూలంగా వ్యవహరించిన అధికారులపై వేటు వేస్తూ వస్తోంది. వీరిపై చర్యలు తీసుకోవడానికి వీల్లేదు. కావున ఉన్నత స్థాయి నుంచి ఒత్తిళ్లు వచ్చినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైసిపి హయాంలో నియమితులైన ఇద్దరినీ రాజీనామా చేసి తప్పుకోవాలని సూచించడంతో ఇద్దరు వైస్ చాన్సలర్లు రాజీనామాలు చేసినట్టు తెలుస్తోంది. వీరితోపాటు రిజిస్ట్రార్లు కూడా పాతవారు తమ పదవుల నుంచి తప్పుకుంటూ రాజీనామా లేఖలు అందజేసినట్టు సమాచారం. అయితే దీనిపై అధికారికంగా యూనవర్శిటీ వర్గాలేవి ధ్రువీకరించలేదు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఇతర అధికారులు

ఇళ్ల వద్దనే పింఛన్లు అందిస్తాం

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జులై 1న లబ్ధిదారులకు వారి ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేసేందుకు తగిన చర్యలు తీసుకున్నామని కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. గురువారం నాడు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ కొండయ్య, డ్వామా పీడీ నరసయ్య, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పింఛన్ల పంపిణీకి శనివారం రోజే బ్యాంకు నుంచి నిధులు డ్రా చేయడానికి చర్యలు తీసుకొంటున్నామన్నారు. ఇందులో భాగంగా 50 హౌస్ హోల్డర్ల మ్యాపింగ్ చేయాల్సి ఉందని శుక్రవారం నాటికి ఆ పని పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో వార్డు సచివాలయాలు 544 ఉన్నాయని ఇందులో 4852 మంది ఉద్యోగులు ఉన్నారన్నారు. వారి ద్వారా ఒకటి రెండు రోజుల్లో పింఛను పంపిణీ పూర్తి చేస్తామన్నారు. అన్ని రకాల పింఛన్ల పంపిణీకి అన్ని చర్యలూ తీసుకొంటున్నామని కలెక్టర్ వివరించారు. అవసరమైతే పోలీసు బందోబస్తు కూడా నిర్వహించడానికి ఎస్పి మాధవరెడ్డితో చర్చించామన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల కార్యదర్శులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'ట్విట్టర్, ఫేస్‌బుక్ హ్యాక్ అవ్వలేదు'..!

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా పోలీస్ ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లు హ్యాక్‌కు గురై జిల్లా పోలీసుల అకౌంట్ పేరుతో డబ్బులు అడుగుతున్న వార్తలను ఎవరూ నమ్మొద్దని సత్య సాయి జిల్లా పోలీసులు గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఇటువంటి అసత్య ప్రచారాన్ని ఎవరూ నమ్మల్సిన అవసరం లేదన్నారు.

ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ముదిగుబ్బ మండలంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా మంత్రి సత్యకుమార్ ఆదేశాలతో పనిచేస్తున్నామనిఎంపీపీ ఆదినారాయణ యాదవ్, మంత్రి ఇంజనీరింగ్ సలహాదారులు శివప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు వారు ముదిగుబ్బలో తాగునీటి సమస్య పరిష్కారానికి పలుచోట్ల పర్యటించారు. దొరిగల్లు రోడ్డు లోని సత్యసాయి ప్రాజెక్టు నీటి సంపుతో పాటు ముదిగుబ్బ గ్రామానికి నీటిని సరఫరా చేసే తాగునీటి ప్రాజెక్టును పరిశీలించారు. ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఇ మల్లికార్జునప్పతో నీటి సరఫరా విషయమై ఆరా తీశారు. ఈత్వరలోనే శాశ్వత ప్రాతిపదికన జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ప్రతి ఇంటికి తాగునీరు సరఫరా చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తామని చెప్పారు. నీటి సమస్యను జూలై 15 నాటికి పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ శాంతన్న, ఏఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటరీ టిడిపి కమిటీ కార్యదర్శిగా 'బికె'

ప్రజాశక్తి -పెనుకొండ

18వ పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ కమిటీ సెక్రటరీగా హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికె. పార్థసారథిని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు నియమించారు. ఈ సందర్భంగా బికె. పార్థసారథి మాట్లాడుతూ తన పై నమ్మకం ఉంచి పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ కమిటీ సెక్రటరీగా నియమించినందుకు చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు చెబుతున్నట్లు తెలిపారు. బికె. పార్థసారథిని పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ కమిటీ సెక్రటరీగా నియమించినందుకు పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.



ఎంపీ బికె. పార్థసారథి

రైతాంగ సమస్యలపై కేంద్రాన్ని నిలదీద్దాం

సంయుక్త కిసాన్ మోర్చా రైతు హక్కుల పోరాట జాతీయ నాయకులు జగ్జీత్ సింగ్ దలయ్ వాల్


ఐక్యత చాటుతున్న రైతు సంఘం నాయకులు, రైతులు

ప్రజాశక్తి-హిందూపురం

దేశ వ్యాప్తంగా రైతాంగ సమస్యలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడానికి రైతులు సిద్ధం కావాలని సంయుక్త కిసాన్ మోర్చా రైతు హక్కుల పోరాట జాతీయ నాయకులు జగ్జీత్ సింగ్ దలయ్ వాల్ పిలుపునిచ్చారు. గురువారం పరగి మండలం వన్నంపల్లి వద్ద ఉన్నా ఖాలా ఫార్మ్ లో మోహిందర్ జీత్ సింగ్ ఆధ్వర్యంలో కల్లూరు మొహమ్మద్ ఉమర్ ఫారూఖ్ ఖాన్ అధ్యక్షతన రైతాంగ సమస్యలపై చర్చ వేదిక కార్యక్రమం జరిగింది. ఈ చర్చా వేదికలో జగ్జీత్ సింగ్ దలయ్ వాల్, కర్నాటక రైతు ఐక్య వేదిక, చెరుకు రైతు అసోషియేషన్ అధ్యక్షులు, దక్షిణ భారత రాష్ట్రాల సమన్వయకర్త కురుబురు శాంతకుమార్, కర్నాటక రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు నారాయణరెడ్డి, న్యూఢిల్లీకి చెందిన జాఫర్ ఖాన్, సుఖ్‌జిత్ సింగ్, తమిళనాడు పీఆర్ పాండ్యన్, హర్యానాకు చెందిన లక్వీందర్ సింగ్, రైతు సంఘాల జాతీయ నాయకులు అతిథులుగా హాజరుకాగా అభిమన్యు క్రోడ్, హరియాణా, ఎపి పట్టు రైతు సంఘం రాష్ట్ర నాయకులు ధనాపురం వెంట్రామి రెడ్డి, జలసాధన సమితి నాయకులు చైతన్య గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలను చేపట్టడంతో కేంద్రం వెనక్కి తగ్గిందన్నారు. లేని పక్షంలో నల్ల చట్టాలను అమలు చేసి రైతులను ఆదాని, అంబానీలకు బానిసలను చేసేవారన్నారు. దేశంలో ఉత్పత్తి చేసిన ప్రతి వస్తువుకు ఉత్పత్తి చేసిన వారు ధరను నిర్ణయిస్తారు, అయితే రైతులు ఉత్పత్తి చేసిన పంటకు రైతులు ధర నిర్ణయించే అధికారంలో లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్. స్వామినాథన్ కమిషన్ నివేదిక ప్రకారం పంటలకు ధరలు నిర్ణయించాలన్నారు. లఖింపూర్ ఖీరీ మారణకాండకు కారకులైన వారిని శిక్షించి, బాధిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 2020-21లో జరిగిన రైతుల ఉద్యమ కేసులన్నింటినీ ఎత్తివేయాలన్నారు. రైతులు, రైతు కూలీలకు పింఛన్లు ఇవ్వాలని, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను మెరుగుపరచి ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలని విద్యుత్ సవరణ బిల్లు 2020ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశంలో స్వామినాథన్ సిఫార్సు ను చట్టంగా చేసి, రైతుల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ప్రతి రైతు ఉద్యమించడానికి సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సిద్దారెడ్డి, ఒపిడిఆర్ శ్రీనివాసులు, సిపిఐ వినోద్ కుమార్, దండోర నాయకులు సతీష్, ఆంజినేయులు, తూమకుంట కార్మిక సంఘం నాయకులు రవికుమార్, దళిత హక్కుల పరిరక్షణ హనుమంతు, నామ్దారీ సిక్కు సంఘాలు నాయకులు, చుట్ట పక్కన ఉన్నా గ్రామల రైతులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు


ఎమ్మెల్యేకు సమస్యలను విన్నవిస్తున్న స్థానికులు

ప్రజాశక్తి - మడకశిర

నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తాననిఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో విజయవాడకు రెండు నూతన సర్వీసులను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిపోలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం స్థానిక రహదారులు విశ్రాంతి భవనంలో నియోజకవర్గస్థాయి అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక వైద్య విధాన పరిషత్ లో డాక్టర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రజలకు మేలైన వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. అదేవిధంగా జులై 1వ తేదీన పంపిణీ చేసే పెన్షన్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం సంత మార్కెట్‌ను పరిశీలించారు. పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. అనంతరం పట్టణంలోని యాదవ కళ్యాణమండపంలో అన్ని మండలాల ఎంపీడీవోలు సచివాలయ సిబ్బంది సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జులై 1 వ తేదీన జరుగు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని అర్హత కలిగిన ప్రతి ఒక్క పెన్షనర్ ఇంటి దగ్గరికి వెళ్లి పంపిణీ చేయాలని తెలిపారు. అంతకు ముందు మధుగిరి సర్కిల్ లోని కూరగాయల మార్కెట్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ కు దారి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. కూరగాయల విక్రయ దారులు దగ్గర అధిక సుంఖం వసూలు చేస్తే అధికారులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, క్లాస్ 1 కాంట్రాక్టర్ గుండుమల జయప్ప, కన్వీనర్లు దాసిరెడ్డి, కుమారస్వామి, మనోహర్, లక్ష్మీనారాయణ, మద్దన కుంటప్ప,, గణేష్ నియోజకవర్గ టిడిపి నాయకులు అధికారులు సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి





సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్, చిలకం మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ప్రతి క్రీడాకారుడు హాకీ క్రీడలో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో గురువారం నిర్వహించిన 13వ హాకీ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ సీనియర్ బాలుర హాకీ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి వీరు హాజరయ్యారు. ఈసందర్భగా వారు మాట్లాడుతూ ధర్మవరం అంటే పట్టుచీరలు ఎలా గుర్తుకు వస్తాయో అలాగే హాకీ క్రీడ కూడా గుర్తుకు వస్తుందన్నారు. చదువుతోపాటు క్రీడల వల్ల ఆసక్తి కనబరచాలన్నారు. వచ్చే ఏడాది నిర్వహించే టోర్నీకి టర్ఫ్‌కోర్టు తీసుకువచ్చేలా కృషిచేస్తామన్నారు. అనంతరం సత్యసాయిజిల్లా హాకీ జనరల్ సెక్రటరీ బంధనాథం సూర్యప్రకాష్‌రావు మాట్లాడుతూ ఈ హాకీ క్రీడల పోటీల్లో 17 జిల్లాల జట్లు పాల్గొంటున్నాయన్నారు. గురువారం ఉదయం ఎన్టీఆర్, ఏలూరు జట్లు తలపడగా ఎన్టీఆర్ జట్టు విజయం సాధించింది. శ్రీకాకుళం, తిరుపతిజిల్లా జట్లు తలపడగా తిరుపతి జట్టు గెలుపొందింది. కాకినాడ, క్రిష్ణజట్లు తలపడగా కాకినాడ జట్టు, అన్నమయ్య, విశాఖపట్నంజట్లు తలపడగా అన్నమయ్య జట్టు విజయం సాధించింది. అనకాపల్లి, అనంతపురం జిల్లా జట్లు తలపడగా ఆ మ్యాచ్ డ్రా అయింది. అదే విధంగా నెల్లూరు-గుంటూరు జట్లు తలపడగా ఆమ్యాచ్ డ్రాఅయింది. ఈ కార్యక్రమంలో ఏపీ హాకీ సీఈవో నిరంజన్‌రెడ్డి, హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు చాణుక్యరాజు, జనరల్ సెక్రటరీ హర్షవర్ధన్. కోశాధికారి తామస్ పీటర్, సత్యసాయిజిల్లా హాకీ అసోషియేషన్ ప్రతినిధులు సూర్యప్రకాశ్, ఉడుముల రామచంద్ర, అంజన్న, విశ్వనాథం, ఎన్టీఆర్ ఫ్యాన్స్ రాష్ట్ర కన్వీనర్ ఎల్ నరేంద్ర, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి

ప్రజాశక్తి - పరిగి

ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహశీల్దార్ రాజేశ్వరి, ఎంఇఒ లక్ష్మీదేవి ఆదేశించారు. ఈ మేరకు వారు గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల పాఠశాలను, బీసీ ఎస్సీ సంక్షేమ హాస్టలను తనిఖీ చేశారు. అనంతరం భోజనం నాణ్యతను విద్యార్థులకు ప్రభుత్వం అందించిన పుస్తకాలు, బ్యాగ్, బూట్ల పంపిణీ రికార్డులను పరిశీలించారు. హాస్టల్లోనే భోజనం తిన్నారు. మరింత నాణ్యమైన భోజనాన్ని అందించాలని హాస్టల్ వార్డన్‌కు సూచించారు.


విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న అధికారులు

లైంగిక వేధింపుల ఘటనపై ఎమ్మెల్యే సీరియస్


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి - చెన్నేకొత్తపల్లి

చెన్నేకొత్తపల్లి మండలంలో సంచలనం రేపిన లైంగిక వేధింపుల అంశంపై ఎమ్మెల్యే పరిటాల సునీత సీరియస్ అయ్యారు. ఎన్ఎస్ గేటు ప్రాథమిక ఆస్పత్రి వైద్యులు ఉదయ్ ఎఎన్ఎంలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న అంశం ఇప్పటికే జిల్లాలో కలకలం రేపింది. డాక్టర్ తమను లైంగికంగా వేధిస్తున్నాడంటూ ఆస్పత్రికి సంబంధించిన పలువురు ఏఎన్ఎంలు పుట్టపర్తిలో డిఎంహెచ్ మంజులవాణికి ఫిర్యాదు చేశారు. దీంతో వైద్యుల కమిటీ గురువారం ఎన్ఎస్ గేట్ ఆస్పత్రికి చేరుకుని విచారణ చేపట్టింది. తాజాగా ఎఎన్ఎంలు ఈ అంశాన్ని మాజీ మంత్రి పరిటాల సునీత దృష్టికి తీసుకొచ్చారు. వైద్యుడు చేసిన వాట్సప్ చాట్‌ను సునీతకు చూపించారు. సాక్షాలు ఉన్నా వైద్యుడిపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించడంపై పరిటాల సునీత సీరియస్ అయ్యారు. వెంటనే డాక్టర్ ఉదయ్ పై చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఒకు సూచించారు. మహిళల పట్ల ప్రభుత్వ కార్యాలయాల్లోనే ఇలాంటి వేధింపులు ఉంటే ఇక బయట పరిస్థితి ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వారిని తమ ప్రభుత్వం క్షమించే ప్రసక్తే లేదని ఆమె స్పష్టం చేశారు. ఎఎన్ఎంలకు ధైర్యం చెప్పి.. కచ్చితంగా చర్యలు ఉంటాయని భరోసా ఇచ్చారు.

ఇంటర్ అడ్వాన్స్ పరీక్ష ఫలితాల్లో ఎల్ఆర్‌జి విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి-హిందూపురం

ఇటీవల ఇంటర్ అడ్వాన్స్ పరీక్ష ఫలితాల్లో హిందూపురం రూరల్ మండలంలో ఉన్న ఎల్ ఆర్ జి కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఇంటర్ పరీక్షల సమయంలోనూ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభను కనబర్చినారు. కొంతమంది విద్యార్థులకు తక్కువ మార్కులు రావడంతో ఇంటర్ అడ్వాన్స్ పరీక్షలకు హాజరై మంచి ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. ఎంపీసీ విభాగంలో రంగస్వామి 470 మార్కులకు గాను 466, బైపీసీ విభాగంలో టీఎస్ అనన్య 440 మార్కులకు గాను 437 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలోనే అత్యుత్తమైన ప్రతిభ కనబరిచారన్నారు. వీరితో పాటు మరికొంతమంది విద్యార్థులు జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచినారన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న సంకల్పంతో ఎల్ఆర్‌జి విద్యాసంస్థల అధినేత సుమంత్ సూచనల మేరకు ఇంటర్ పూర్తి చేసుకున్న


466 మార్కులు సాధించిన రంగస్వామి


437 మార్కులు సాధించిన టీఎస్ అనన్య

విద్యార్థులకు తక్కువ ఫీజులతో నీట్ లాంగ్ టర్మ్ ప్రోగ్రాం ద్వారా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ శిక్షణను ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు విద్యాసంస్థల సెక్రటరీ బాలసుందరం, ఏవో సంజీవరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

మున్సిపాలిటీ పరిధిలోని ఇస్లాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తెలుగుదేశం నాయకులు నోటుబుక్కులు పెన్నులు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ గీతా హనుమంతు మాట్లాడుతూ బిసి సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత పదవి బాధ్యతలు చేపట్టిన శుభ సందర్భంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు, బిస్కెట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యం, హనుమన్న, దుద్దేబండ శ్రీరాములు, రవితేజ, శ్రీహరి, కార్యకర్తలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : మండలంలోని కొండాపురం పంచాయతీ రాగి మేకల పల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన ఆదర్శ రైతు గంగాధర్ రెడ్డి విద్యాసామగ్రిని అందజేశారు. విద్యార్థులకు పెన్నులు, పలకలు, నోటు పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు ఉచితంగా అందజేశారు. దాత గంగాధర్ రెడ్డి ప్రతి ఏడాది తన ఊరిలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా విద్యా సామాగ్రి అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్, సురేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నవోదయ పాఠశాలకు ఒడిసి విద్యార్థిని

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

మండల కేంద్రానికి చెందిన ఎవిఎస్ ట్రెడర్స్ ఆదినారాయణరెడ్డి కుమార్తె ఇందుకూరి గగన నవోదయ విద్యాలయంలో 9వతరగతి ప్రవేశానికి ఎంపికైంది. జీవనజ్యోతి పాఠశాలలో 8వతరగతి చదువుకున్న గగన 2024-25 నవోదయ ఎంట్రన్స్ టెస్ట్ రాసింది. ఆ ఫలితాల్లో ర్యాంకు సాధించి ప్రవేశానికి ఎంపికైంది. ఒసి కేటగిరిలో డివిజన్ స్థాయిలో విద్యార్థిని ఇందుకూరి గగన మాత్రమే నవోదయ ప్రవేశానికి ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. శ్రీసత్యసాయిజిల్లా లేపాక్షి నవోదయ విద్యాలయంలో ప్రవేశానికి ఎంపికైన సందర్భంగా తల్లిదండ్రులు,వడ్డివారిపల్లి వాసులు, ఉపాధ్యాయులు గగనను అభినందించారు.

విద్యతోనే భవిష్యత్తు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

విద్యతోనే భవిష్యత్తుకు పునాది అని 25వ వార్డు టీడీపీ ఇన్‌ఛార్జి భీమనేని ప్రసాద్‌నాయుడు అన్నారు. పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవపురంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం 121 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, నోటు బుక్కులు తదితర విద్యాసామాగ్రిని ఆ వార్డు టీడీపీ ఇన్‌ఛార్జి భీమనేని ప్రసాద్‌నాయుడు, టీడీపీ నాయకుడు మాధవరెడ్డిలతో కలిసి ఆ పాఠశాల హెచ్‌ఎం నాగప్పకు అందజేశారు.

మంత్రిని కలిసిన మైనార్టీ నాయకుడు

ప్రజాశక్తి - గోరంట్ల

పెనుగొండ పట్టణంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మను గోరంట్ల పట్టణానికి చెందిన మైనార్టీ యువ నాయకుడు ఉమర్‌ఖాన్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు మసీదు పెద్దలు మౌలాలీలు ఈ సందర్భంగా మంత్రిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - గోరంట్ల

మండలంలోని పాలసముద్రం గ్రామానికి చెందిన నరసింహమూర్తి (40) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం తన ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మతుడు నరసింహమూర్తి అతని భార్య ఇద్దరూ తరచూ గొడవ పడుతుండేవారని దీంతో మనస్థాపానికి గురై ఆత్మ హత్యకు పాల్పడ్డారని మృతుడి తల్లి గంగ రత్నమ్మ ఫిర్యాదు చేసిందని ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని వారు చెప్పారు.

చేనేత కార్మికుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

కడుపు నొప్పి తాళలేక ఓ చేనేత కార్మికుడు గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... యాదవవీధికి చెందిన నరసింహులు కూలిమగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత కొంతకాలంగా నరసింహులు కడుపునొప్పి తాళలేక బాధపడుతుండేవాడు. కడుపు నొప్పి తీవ్రం కావడంతో ఇంటిలో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసింహులను అనంతపురానికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టిడిపి సీనియర్ నాయకుడు మృతి

ప్రజాశక్తి - మడకశిర

పట్టణానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు శశికుమార్ అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి శశికుమార్ మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని ఈసందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గుండెపోటుతో చేనేత కార్మికుడు..

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని మూడోవార్డుకు చెందిన చేనేత కార్మికుడు గడ్డంశివ(36) గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. ఈ విషయాన్ని స్థానిక కూటమి నాయకులు మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి మృతుని కుటుంబసభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి ఆదేశాల మేరకు చేనేత కార్మికుడి కుటుంబానికి బీజేపీ కార్యాలయ సిబ్బంది రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు.

కేంద్రమంత్రిని కలిసిన నాయకులు

ప్రజాశక్తి - సోమందేపల్లి

న్యూఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును పెనుకొండ నియోజకవర్గం టీడీపీ సీనియర్ నాయకులు కురుబ కృష్ణమూర్తి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తేదేవిధంగా అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను కురుబ కృష్ణమూర్తి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'నేను బడికి పోతా' ర్యాలీ

ప్రజాశక్తి - మడకశిర

ప్రభుత్వం చేపట్టిన నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలో ఎంఇఒ శ్రీనివాస భాస్కర్ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు శ్రీనివాస భాస్కర్ , నరసింహ మూర్తి , మున్సిపల్ కమిషనర్ రంగస్వామి , ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాఘవయ్య, ప్రభుత్వం బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శకుంతలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పంట సాగుపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని కురుమామిడి రైతు భరోసా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఖరీఫ్‌లో చేపట్టే పంటసాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు.కదిరి ఎడిఎ,డిఆర్‌సి షమీవుల్లా, అబ్దుల్ అలీ పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. పంటసాగు, యాజమాన్యపద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఒ లక్ష్మీ ప్రియ, సర్పంచులు సిఎన్ఎ సుధాకర్, ఎస్ శివప్ప నాయుడు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో పాఠశాలకు మరమ్మతులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలోని దేమకేతేపల్లి గ్రామపంచాయతీలోని ఓబుళాపురం గ్రామంలో శిథిలావస్థలో వున్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని బెంగళూరు నగరానికి చెందిన పుష్పాంజలి రెడ్డి తన స్వంత నిధులు వెచ్చించి వేసవి సెలవుల్లో మరమ్మతులు చేయించారు. మరమత్తులు పూర్తి చేసిన పాఠశాల భవనాన్ని సర్పంచి ఈడిగ తిరుమలేశ్ చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, వార్డు సభ్యులు జయమ్మ, పాఠశాల కమిటీ ఛైర్మన్ హేమలత, గ్రామస్తులు శంకరప్ప, నరసింహప్పతో పాటు విద్యార్థులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి మంత్రి చేయూత

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ఓ పేద ముస్లిం కుటుంబంలోని చిన్నారుల విద్య కోసం మంత్రి సత్య కుమార్ యాదవ్ అండగా నిలిచారు. పట్టణంలోని 23వ వార్డుకు చెందిన అయూబ్ ఖాన్ మృతి చెందడంతో ఆ కుటుంబం వీధిన పడింది. సత్యకుమార్ యాదవ్ ఎన్నికల సమయంలో ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి పిల్లల విద్యా బోధన కోసం తమవంతు కృషి చేస్తానని అప్పట్లో హామీ ఇచ్చారు. ఆయన ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చుకున్నారు. పిల్లల్లో ఒకరిని జీవనజ్యోతి పాఠశాలకు, మరొకరిని ఆర్డీటీ పాఠశాలలో చేర్పించి వారికి కావలసిన సదుపాయాలను మంత్రి ఏర్పాటు చేసినట్లు నాయకులు తెలిపారు.

డయేరియాపై అవగాహన

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డయోరియా వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ డయేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ రమణప్ప, ప్రధాన ఉపాధ్యాయురాలు రమాదేవి, సచివాలయ వెల్ఫేర్ నాగేష్, మహిళా పోలీసులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

మంత్రిని కలిసిన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

ప్రజాశక్తి - సోమందేపల్లి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు వి.బి.భాస్కర్ రెడ్డి తదితరులు మంత్రి సవితను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పెనుకొండ తాలూకా అధ్యక్షుడు ఎస్ అబ్దుల్ ఖాదర్, సెక్రెటరీ ఎం.బషీర్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్.నరసింహమూర్తి, వైస్ ప్రెసిడెంట్లు కె. చంద్రశేఖర్, బి. ఎస్.జగన్నాథ్, ఎస్ . షేక్ షావలి, బిఎం.సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

మాంగల్య షోరూంపై చర్యలు తీసుకుంటాం : చిలకం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ధర్మవరంపట్టణంలో ఏర్పాటుచేసిన మాంగల్యషాపింగ్ మాల్‌ను ఇక్కడి నుంచి పంపించేలా మంత్రి సత్యకుమార్‌యాదవ్, టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్‌తో చర్చించి చర్యలు తీసుకుంటామనిజనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు ధర్మవరంపట్టణం లోని వస్త్రవ్యాపారులు గురువారం జనసేనపార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డిని కలిసి సమస్యను విన్నవించారు. ధర్మవరం పట్టణంలో మాంగల్య షాపింగ్ మాల్ రాకమునుపు తమ వ్యాపారాలు బాగా జరిగేవని, మాల్ వచ్చిన తరువాత తమ వ్యాపారాలకు పూర్తిగా దెబ్బపడి ఉపాధి కోల్పోయే పరిస్థితి వచ్చిందని అన్నారు. ఈ షాపింగ్ మాల్‌ను ధర్మవరం నుంచి పంపించి తమకు ఉపాధి అవకాశాలు కల్పించాలని వస్త్ర వ్యాపారులు కోరారు. స్పందించిన చిలకం ఇచ్చిన మాట ప్రకారం మంత్రి, టిడిపి ఇన్‌ఛార్జితో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బెస్తశ్రీనివాసులు, అడ్డగిరి శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.